సాక్షి
కామారెడ్డి
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



క్షుద్రపూజల కలకలం

రైతునగర్‌లో క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు.

- 8లో ▸



పూడుకుపోయిన కాలువలు

నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ఉప కాలువలు అధ్వానంగా ఉండడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /14.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక

కామారెడ్డి రూరల్: ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఏటా ఫిబ్రవరి 28 న నిర్వహించే సైన్స్ సెమినార్‌కు జిల్లాకు చెందిన ఇద్దరు సైన్స్ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. చిన్నమల్లారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్, భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తమ్మల రాజు ఈ సెమినార్‌కు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. వీరిని డీఈవో రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.సిద్దిరాంరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

3.65 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్



చెరుకు క్రషింగ్ ముగింపు పూజ చేస్తున్న ఫ్యాక్టరీ ప్రతినిధులు

నిజాంసాగర్: మాగిలోని గాయత్రి కార్మాగారంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 3.65 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ చేసినట్లు ఫ్యాక్టరీ కేన్ మేనేజర్ వెంగళరెడ్డి తెలిపారు. ఆదివారం మాగి గాయత్రి కార్మాగారంలో చెరుకు క్రషింగ్ ముగింపు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మాగారం పరిధిలో 5,122 మంది రైతుల నుంచి చెరుకు సేకరించామన్నారు. టన్నుకు రూ. 3,642 చొప్పున ధర చెల్లించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మాగారం వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రావ్, జీఎం సుబ్బారెడ్డి, ఏజీఎం గోవింద్, పీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీకే అరుణ రాక

కామారెడ్డి టౌన్: మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సోమవారం కామారెడ్డికి రానున్నారని ఆ పార్టీ కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయంలో సమావేశం అనంతరం 12 గంటలకు బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. ఆ తర్వాత జిల్లా గ్రంథాలయంలో పట్టభద్రులతో మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని పట్టభద్రులను కోరారు.

కాంగ్రెస్‌తో సంబంధం లేదు



మాట్లాడుతున్న మదనం గంగాధర్


కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ డీఎస్పీ మదనం గంగాధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హన్మంత్‌రావు తనకు ఎలాంటి విషయాలు తెలపకుండా మంత్రి శ్రీధర్ బాబు చాంబర్‌లో ఫొటోలు తీయించి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేశారన్నారు. తాను ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదన్నారు. తన మేనిఫెస్టోను పరిశీలిస్తామని హామీ ఇవ్వడం, సీఎం, మంత్రులు ఒత్తిడి చేయడంతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోనుంచి తప్పుకున్నానని పేర్కొన్నారు. పట్టభద్రుల సంక్షేమం కోసం చర్చించడానికి సీఎం, మంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాలని పిలుపునిచ్చారు.

యూఏఈకి ఉచిత వీసాలు

మోర్తాడ్: గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందాలనుకునే వలస కార్మికులకు మరోసారి ఉచితంగా వీసాలు జారీ చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ప్రభుత్వ రంగ సంస్థ ఏడీఎన్‌హెచ్ కంపెనీ లైసెన్స్ ఏజెన్సీ జీటీఎం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. మార్చి 1న ఏడీఎన్‌హెచ్, జీటీఎం సంస్థలు సంయుక్తంగా మేళా నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నాయి. కంపెనీల ప్రతినిధులే నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించనుండడంతో ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని జీటీఎం చైర్మన్ సతీశ్‌రావు 'సాక్షి'తో పేర్కొన్నారు. ఈసీఎన్‌ఆర్ పాస్‌పోర్టు ఉండి, బేసిక్ ఇంగ్లిష్‌లో మాట్లాడేవారు అర్హులను పేర్కొన్నారు. 21 నుంచి 36 ఏళ్లలోపు వయసు వారికే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వివరాలకు నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల, సిరిసిల్ల, సికింద్రాబాద్‌లలోని జీటీఎం సంస్థ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆగని కీచకపర్వం

- జిల్లాలో చిన్నారులపై పెరుగుతున్న లైంగిక దాడులు
- కేసులు పెడుతున్నా తగ్గని అఘాయిత్యాలు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు



కామారెడ్డి క్రైం : ప్రభుత్వాలు చిన్నారుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నా వేధింపులు, దాడులకు అడ్డుకట్ట పడడంలేదు. వారిపై నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. మహిళలు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలకు సంబంధించి ఏడాది కాలంలో కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 72 కేసులు నమోదయ్యాయి. వాటిలో 49 పోక్సో కేసులున్నాయి. జరుగుతున్న కేసులకు సంబంధించి బాధిత మహిళలకు, చిన్నారులకు భరోసా కల్పించడానికి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏడాది క్రితం భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు వైద్యం, వసతి, న్యాయ సేవలు అందించడానికి కృషి చేస్తున్నారు. అంతే కాకుండా ఏవైనా ఘటనలు వెలుగుచూసినప్పుడు సంబంధిత సబ్‌డివిజన్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కేసుల విచారణతో పాటు నిందితులపై కఠినంగా వ్యవహరిస్తూ జైలుకు పంపుతున్నారు. అయినా తరచుగా ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో మద్యం, మత్తు పదార్థాల సేవనం ఎక్కువవుతోంది. కొందరు రాత్రి, పగలు తేడా లేకుండా మత్తులో మునిగితేలుతున్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, అఘాయిత్యాలకు మత్తు పదార్థాల సేవనం కూడా కారణమని భావిస్తున్నారు.

చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల నియామకం

జిల్లా యంత్రాంగం ప్రతి పాఠశాలలో లైంగిక దాడుల నియంత్రణ కమిటీలతోపాటు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులను నియమించింది. పాఠశాలలోని పిల్లలపై ఎలాంటి లైంగిక దాడులు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం కోసం ఈ ఏర్పాట్లు చేసింది. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు చట్టాలపై శిక్షణ కూడా ఇచ్చారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పు చేస్తే శిక్ష తప్పదు



బాలికలు, మహిళలపై అత్యాచారాలను నియంత్రించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. చిన్నారులపై దాడులను అరికట్టడానికి క్రమం తప్పకుండా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాధితులకు అండగా ఉంటూనే నిందితులకు శిక్ష పడేలా చూస్తున్నాం. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు.

– నరసింహారెడ్డి, అడిషనల్ ఎస్పీ, కామారెడ్డి

జిల్లాలో ఇటీవల వెలుగు చూసిన ఘటనలు..

- గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినితో ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈనెల 17న సదరు టీచర్‌పై కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారులు ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు.
- రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం చేసినట్లు చిన్నారి తండ్రి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఈనెల 20న నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.
- బాన్సువాడ మండలంలో మూడు వారాల క్రితం దారుణం చోటు చేసుకుంది. హాస్టల్ నుంచి సెలవుపై ఇంటికి వచ్చిన కూతురిపై కన్నతండ్రే లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు.
- కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నివసించే ఓ వ్యక్తి తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్దకు తీసుకువెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. నెల రోజుల క్రితం జరిగిన ఈ దారుణంపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.
- కొన్నాళ్ల క్రితం రామారెడ్డిలోని ఓ దుకాణానికి చాక్లెట్ కోసం వచ్చిన బాలికతో దుకాణం యజమాని అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికులు ఆందోళనను దిగడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది.
- కొన్ని నెలల క్రితం బాన్సువాడ మండలంలో ఓ బాలికతో టీచర్ అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యవహారం దుమారం రేపింది. గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి, నిందితుడికి జరిమానా విధించి వదిలేశారు. అయితే ఈ విషయం పోలీసుల వరకు వెళ్లడంతో పంచాయితీ నిర్వహించిన 9 మందిపై కేసు నమోదు చేశారు. సదరు టీచర్‌పై పోక్సో కేసు పెట్టి అరెస్ట్ చేశారు.

కామారెడ్డి బల్దియాకు ఐటీ షాక్

- ఆదాయపు పన్ను చెల్లించనందుకు ఖాతాలు ఫ్రీజ్
- 18 ఏళ్లకు సంబంధించి రూ. 39 లక్షలు బకాయి
- ఆలస్యంగా వెలుగులోకి..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాకు ఆదాయపు పన్ను శాఖ షాక్ ఇచ్చింది. 18 ఏళ్లుగా ఆదాయ పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ అకౌంట్లను ఫ్రీజ్ చేసింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి బల్దియాకు సంబంధించి 2007–08 నుంచి ఆదాయపు పన్ను చెల్లించడం లేదు. 18 ఏళ్లకు సంబంధించి రూ. 39 లక్షలకుపైగా బకాయిలు ఉన్నాయి. ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలంటూ ఇప్పటికే 15 కుపైగా నోటీసులు ఇచ్చారు. అయినా బల్దియా నుంచి స్పందన లేకపోవడంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఈనెల 17న మున్సిపాలిటీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలన్నింటిని ఫ్రీజ్ చేశారు. అయితే ఈ విషయం బయటికి పొక్కకుండా బల్దియా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ ఖాతాలు స్తంభించడంతో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయి విషయం వెలుగులోకి వచ్చింది. ఖాతాలు ఫ్రీజ్ కావడంతో ఉద్యోగులు, కార్మికుల వేతనాల, అత్యవసర బిల్లుల చెల్లింపుల కోసం అధికారులు నానా పాట్లు పడాల్సి వస్తోంది. ఇప్పటికే ఖజానాలో డబ్బులు లేకపోవడంతో నెలనెలా కార్మికుల వేతనాలు చెల్లించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పుడు బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ కావడంతో జనరల్ ఫండ్ నుంచి నిధులు వినియోగించే అవకాశం లేక మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా తాను ఇటీవలే కమిషనర్‌గా వచ్చానన్నారు. 18 ఏళ్లుగా ఆదాయపు పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. అకౌంట్స్ ఫ్రీజింగ్ ఎత్తివేయాలని కోరామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కారమయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.



నేడు నిజామాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి గార్డెన్స్‌లో సోమవారం మధ్యాహ్నం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున సీఎం రేవంత్‌రెడ్డి పట్టభద్రులతో మాట్లాడుతారని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత

ఖలీల్‌వాడి: సీఎం రాక నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. నగరంలోని గిరిరాజ్ కాలేజీ నుంచి భూమారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఇప్పటికే భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌ను అధీనంలోకి తీసుకున్నామన్నారు. బందోబస్తులో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు 200 మంది పాల్గొంటున్నారని వివరించారు.

నీటి కోసం కో(తి)టి తిప్పలు



అప్పుడే ఎండలు మండుతున్నాయి. వేసవిలో నీటి కోసం కోటి తిప్పలు తప్పేలా లేవు. దాహార్తిని తీర్చుకునేందుకు జీవాలు అష్టకష్టాలు పడుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో నీటి నిల్వలు తగ్గడంతో జంతువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. లింగంపేటలో ఓ కోతి నీటి కోసం అష్టకష్టాలు పడింది. చివరికి కుళాయిని తిప్పి నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – లింగంపేట

కాంగ్రెస్ అభ్యర్థికి పట్టం కట్టాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: పట్టభద్రులు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పట్టం కట్టాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖలలోని ఖాళీలను త్వరగా భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నిరుద్యోగులకు త్వరలో తీపి కబురు చెబుతామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

'ఉపాధి'కి మొగ్గు!

- పనులకు వస్తున్న కూలీలు
- ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యత



నాగిరెడ్డిపేట మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నాగిరెడ్డిపేట: వరి నాట్లు పూర్తవడంతో కూలీలు ఉపాధి హామీ పథకం పనులపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో క్రమంగా ఉపాధి పనులకు హాజరవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో 2.50 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. వాటి పరిధిలో 4.79 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో వారం రోజులుగా కూలీలు ఉపాధి హామీ పనులకు వస్తున్నారు. రోజూ 8 వేల మంది కూలీలు పనులు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంటున్నారు.

ఆరు విభాగాలు..

కాగా గతంలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ముందుకుసాగిన అధికారులు.. ఈసారి నిరుపేదల కుటుంబాల జీవన ప్రమాణాలు పెంపొందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇదివరకు ఉపాధిహామీ పథకం ద్వారా చెరువులు, కుంటల్లో పూడికతీత, పొదల తొలగింపు వంటి పనులు చేపట్టేవారు. ఈసారి ప్రజలకు ఉపయోగపడేటటువంటి పనులకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీనిలో భాగంగా ఆరు విభాగాలలో పనులు చేపడుతున్నారు. మహిళాశక్తి ఉపాధి భరోసా విభాగం కింద క్యాటిల్‌షెడ్లు, పౌల్ట్రీ, భూ అభివృద్ధి, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. పొలం బాటలు విభాగం ద్వారా రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేలా ఫార్మేషన్ రోడ్లు పనులు చేపడుతున్నారు. పల్లె వనాలు విభాగం కింద కొబ్బరి, ఈత, మామిడి వంటి పండ్ల తోటలను పెంచనున్నారు. జలనిధి విభాగం ద్వారా చెక్‌డ్యాంల నిర్మాణం, ఫాంపాండ్, ఊట కుంటల తవ్వకం వంటి పనులు చేపట్టనున్నారు. రూరల్ శానిటేషన్ విభాగం ద్వారా ఇంకుడు గుంతలు, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగం ద్వారా గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, స్కూల్ టాయ్‌లెట్స్, అంగన్‌వాడీ భవన నిర్మాణాల వంటి పనులు చేపట్టనున్నారు.

పకడ్బందీగా పనులు..

గ్రామాల్లో ఈ ఏడాది ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపడుతున్నాం. ప్రజలకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉపాధి పనులకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– సాయిలు, ఇన్‌చార్జి ఏపీవో, నాగిరెడ్డిపేట

నాణ్యత డొల్ల.. ప్రజాధనం వృథా

- నర్సరీల్లో మొక్కల పెంపకం
- ఎండనుంచి రక్షణ కోసం షేడ్‌నెట్‌ల కొనుగోలు
- ఏటా రూ.లక్షల్లో ఖర్చు
- నాసిరకంగా ఉండడంతో చిన్నపాటి గాలులకే చినిగిపోతున్న వైనం

దోమకొండ: ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలకు నీడ కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న నాసిరకపు షేడ్‌నెట్‌లతో ప్రజాధనం వృథా అవుతోంది. కొనుగోలు సమయంలో నాణ్యతను పట్టించుకోకపోవడంతో చిన్నపాటి ఈదురుగాలులకే షేడ్‌నెట్‌లు చినిగిపోతూ పనికి రాకుండా పోతున్నాయి. దీంతో ప్రతి ఏడాది కొత్తవాటి కోసం రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది.

చినిగిపోతున్న షేడ్‌నెట్‌లు

మొక్కల పెంపకానికి కొనుగోలు చేసే షేడ్‌నెట్‌లు నాసిరకంగా ఉంటుండటంతో చిన్నపాటి గాలికే చినిగిపోతున్నాయి. గతేడాది కొనుగోలు చేసిన షేడ్‌నెట్‌లు పనికిరాకుండా పోవడంతో మళ్లీ కొత్త వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ప్రతి ఏడాదీ కొనుగోలు చేసేందుకు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. నాసిరకానికి బదులుగా శాశ్వత ప్రాతిపదికన ఒకేసారి నాణ్యమైన నెట్లను కొనుగోలు చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



మొక్కలను కాపాడేందుకు..

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో ఎండవేడిమి నుంచి మొక్కలను కాపాడేందుకు నాణ్యమైన షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. దాదాపు అన్ని నర్సరీల్లో కొత్త షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేశారు.

– సురేందర్, డీఆర్డీవో, కామారెడ్డి

ఒక్కో షేడ్ నెట్‌కు రూ.3వేలు

జిల్లా వ్యాప్తంగా 527 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసింది. ఒక్కో నర్సరీలో 4వేల చొప్పున మొత్తం దాదాపు 21 లక్షల 8వేల మొక్కలను పెంచుతున్నారు. వేసవి కాలంలో ఎండవేడిమి నుంచి మొక్కలను రక్షించేందుకు షేడ్‌నెట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని గ్రామ పంచాయతీ నిధుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. లక్ష మొక్కలకు సుమారు పది షేడ్‌నెట్‌లు, లక్ష కన్నా ఎక్కువ ఉంటే 15 నుంచి 20వరకు ఉపయోగిస్తున్నారు. ఒక్కో షేడ్‌నెట్‌కు రూ.3 వేల వరకు వెచ్చిస్తుండగా, లక్ష మొక్కలు పెంచే నర్సరీలకు రూ.30 వేలు, అంతకన్నా ఎక్కువ ఉంటే రూ.50 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

క్లుప్తంగా

దేవాదాయ శాఖ సిబ్బందితో వ్యక్తిగత పనులు

- ఉన్నతాధికారి తీరుపై విమర్శలు

నస్రుల్లాబాద్‌: దేవాదాయ శాఖకు చెందిన ఉన్నతాధికారి వ్యవహారం చర్చనీయాంశమైంది. సదరు అధికారి నస్రుల్లాబాద్‌లో ఇల్లు నిర్మించుకుంటున్నారు. అయితే కూలీలతో చేయించుకోవాల్సిన పనులను శాఖ సిబ్బందితో చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రెండు నెలలుగా ఈ తతంగం నడుస్తోందని తెలుస్తోంది. దేవాదాయ శాఖ సిబ్బంది సొంత వాహనాలపై సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించి నస్రుల్లాబాద్‌కు వచ్చి విడతలవారీగా పనులు చేస్తున్నట్లు సమాచారం. శాఖసిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్న అధికారి తీరుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలు పరీక్ష హాల్లో.. తల్లిదండ్రులు రోడ్లపైన..



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్ష రాయించడానికి పోచంపాడ్ పరీక్షకేంద్రం వద్దకు వచ్చారు. పిల్లలు పరీక్షకేంద్రంలోకి వెళ్లగా, వారివెంట వచ్చి తల్లిదండ్రులు రోడ్డుపైనే వేచిఉన్నారు. రోడ్డులోని డివైడర్‌పై వరుసగా వారు కూర్చోవడంతో 'సాక్షి' క్లిక్ మనిపించింది.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల గురుకులంలో ఆదివారం నిర్వహించిన టీజీసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బీసీ గురుకులంలో 150 మందికి 148 మంది హాజరయ్యారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో 796 మందికి 31 మంది గైర్హాజరయ్యారు. డీఈవో అశోక్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎంఈవో గేమ్‌సింగ్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

అటవీ శాఖలో ఇమడలేక..

- ఉద్యోగాలను వదులుకుంటున్న బీట్ ఆఫీసర్లు
- వేరే శాఖల్లో ఉద్యోగాలు వెతుక్కుంటున్న వైనం
- నాలుగేళ్లలోనే 87కు చేరుకున్న ఖాళీలు
- అడవుల సంరక్షణకు కరువైన సిబ్బంది



ఫీల్డ్ విజిట్‌లో శిక్షణ పొందుతున్న ఎఫ్‌బీవోలు (ఫైల్)

మొత్తం ఎఫ్‌బీవో పోస్టులు	153
పని చేస్తున్న వారు	66
ఖాళీలు	87

డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీ శాఖ ఖాళీ అవుతోంది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు(ఎఫ్‌బీవో) శాఖలో ఇమడలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. టైమింగ్ లేకుండా విధులు నిర్వర్తించడంతోపాటు పని ఒత్తిడి కూడా పెరగడంతో ఎఫ్‌బీవో ఉద్యోగం చేయడానికి ఇష్టపడడం లేదు. టీచర్, పోలీస్, గ్రూప్స్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తుండగా ఇప్పటికే చాలా మందికి ఉద్యోగాలు వచ్చాయి. అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం రాత పరీక్ష నిర్వహించి బీట్ ఆఫీసర్ల నియామక ప్రక్రియ చేపట్టగా, నాలుగేళ్ల క్రితం కొత్తగా 80 మంది వరకు నియమితులయ్యారు. వారిలో నుంచి సుమారు 50 మందికి పైగా బీట్ ఆఫీసర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి వేరే శాఖల్లో స్థిరపడ్డారు. జీతాలు తక్కువైనా ఫర్వాలేదంటూ ఇతర శాఖల్లో ఉద్యోగాల కోసం పరీక్షలు రాయడం అటవీ శాఖలో ఉద్యోగం ఎంత కఠినమైందో తెలుస్తోంది. అడవులు, వన్య ప్రాణులను సంరక్షించడంతోపాటు అటవీ భూములను కాపాడడం ప్రతిరోజూ టాస్క్‌లా మారింది. ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేయడంతో తమకు కూడా పోడు పట్టాలు వస్తాయనే ఉద్దేశంతో పలు చోట్ల గిరిజనులు భూములను దున్నడం ప్రారంభించారు. ఈ ప్రాంతాలకు వెళ్లిన బీట్ ఆఫీసర్లపై బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయి. పైగా కొందరు పై స్థాయి అధికారుల వేధింపులు, సెలవులు ఇవ్వకపోవడం కారణంగానే బీట్ ఆఫీసర్ ఉద్యోగం చేయడానికి భయపడుతున్నారనే ఆరోపణలున్నాయి. భద్రత లేని ఒత్తిడి కలిగిన ఉద్యోగం తమకొద్దని చాలామంది వేరే ప్రభుత్వ ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఇంకా చాలా మంది పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు.

ఉన్నవారికి అదనపు బీట్‌లు

జిల్లాలో ప్రస్తుతం 66 మంది ఎఫ్‌బీవోలు మాత్రమే పని చేస్తుండగా, 87 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలు పెరిగిపోవడంతో అటవీ శాఖ అధికారులు ప్రస్తుతం పని చేస్తున్న బీట్ ఆఫీసర్లకే అదనపు బీట్లు అప్పగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో బీట్‌కు అంటే 1500 నుంచి 2వేల ఎకరాలకు ఒక బీట్ ఆఫీసర్ ఉండాలి. కానీ ఎఫ్‌బీవో పోస్టుల ఖాళీలతో ఒక్కొక్కరికి రెండు నుంచి ఐదు బీట్‌లు ఇచ్చి అదనపు భారం వేస్తున్నారు. దీంతో పని ఒత్తిడి పెరుగుతోందని ఎఫ్‌బీవోలు వాపోతున్నారు. ప్రధానంగా అటవీ భూములు, పోడు సమస్యలు ఎక్కువగా ఉన్న ఇందల్వాయి, సిరికొండ, వర్ని రేంజ్‌ల పరిధిలో చాలా ఎఫ్‌బీవో పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ రేంజ్‌ల పరిధిలో అడవుల సంరక్షణ కష్టంగా మారింది.

పేదింటి బిడ్డ.. క్రీడల్లో దిట్ట

- సాఫ్ట్‌బాల్ ఆటలో రాణిస్తున్న కీర్తన
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో 9 గోల్డ్‌మెడల్స్, 2 సిల్వర్ పతకాలు అందుకున్న వైనం



సాధించిన కప్‌తో సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి కీర్తన



గోల్డ్‌మెడల్ సాధించిన కీర్తనతో తల్లిదండ్రులు

మాక్లూర్: పేదరికంలో పుట్టినా.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా తన క్రీడానైపుణ్యంతో ప్రతిభ చాటుతోంది సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి కీర్తన. మాక్లూర్ మండలంలోని ఒడ్డెట్‌పల్లికి చెందిన దుడ్డు గంగాధర్–సవితల మొదటి కూతురు కీర్తన ప్రస్తుతం సుద్దులం ఎస్సీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. అలాగే ఎంచుకున్న క్రీడారంగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని, ప్రతిభ చాటుతూ అతిచిన్న వయస్సులోనే లక్ష్యానికి దగ్గరవుతుంది. తల్లిదండ్రులు పడుతున్న ఆర్థిక కష్టాలను దూరం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇప్పటి వరకు 9 గోల్డ్ మెడల్, 2 సిల్వర్ పతకాలు సాధించింది. అలాగే ఇటీవల జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఫైనల్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుతో ఆమె తెలంగాణ జట్టు తరఫున తలపడి కప్‌ను సాధించారు. జట్టు విజయంతో ఆమె ప్రతిభ కనబర్చటంతో విడిగా గోల్డ్‌మెడల్ సాధించింది. దీంతో కీర్తన పేరు జిల్లా సరిహద్దులు దాటింది. ఈక్రమంలో పోటీల అనంతరం ఆమె సొంతూరుకు రాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, సన్మానించారు.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

మాది పేద కుటుంబం. మా అమ్మనాన్నలకు ఇద్దరం ఆడపిల్లలమే. మా నాన్న గతంలో కొన్ని రోజులు దుబాయ్ వెళ్లగా, అప్పులు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆయన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సఫాయి కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లిదండ్రుల కష్టాలను తీర్చడానికే ఒకపక్క శ్రద్ధతో చదువుకుంటునే ఎంచుకున్న సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాను. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించటమే నా లక్ష్యం.

–డి. కీర్తన, సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి

పంటను కాపాడుకునేందుకు పాట్లు



కాకతీయ కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఇంజిన్



ఇంజిన్ ద్వారా పంట పొలానికి అందిస్తున్న నీరు

- ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువవడంతో ఓ రైతుకు దక్కని విద్యుత్ కనెక్షన్
- డీజిల్ ఇంజిన్‌తో సాగు నీరు సరఫరా చేయాల్సిన పరిస్థితి
- కనెక్షన్ ఇప్పించాలని వేడుకోలు



బాజన్న

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంకు చెందిన రైతు బాజన్న తన ఎకరం పంట భూమికి మోటార్ ద్వారా నీరు అందించడానికి డీజిల్‌తో నడిచే ఇంజిన్ ఏర్పాటు చేసుకున్నాడు. దూదిగాం శివారు గుండా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ ప్రవహిస్తుంది. దీంతో కాలువ అంచున పంటపొలాలు ఉన్న రైతులు పంపుసెట్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకొని మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ పొలాలకు అందిస్తున్నారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడ్ ఎక్కువవడంతో బాజన్న పంపుసెట్‌కు విద్యుత్ కనెక్షన్ రాలేదు. సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలంటే ఖర్చుతో కూడుకున్నది. అలాగే ఒక్క మోటార్‌కు అంత విద్యుత్ అవసరం ఉండదు. దీంతో సదరు రైతు మోటార్‌కు డీజిల్‌తో నడిచే ఇంజిన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. రూ.200 డీజిల్ పోస్తే రెండున్నర గంటలు నీటి సరాఫరా చేస్తుందని రైతు బాజన్న తెలిపారు. ఈ సమయంలో ఎకం పొలంలోని వరి పంటకు, మామిడి చెట్లకు నీరు అందుతుందన్నారు. కానీ వరికి నిత్యం నీరు అవసరం కావడంతో సగటున రోజుకు రూ.300 ఖర్చు తప్పడం లేదంటున్నారు. తాను సాగు చేయగా వచ్చే మొత్తంలో సగం కంటే ఎక్కువగా డీజిల్ ఖర్చుకే అవుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తనకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతున్నాడు.

43 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు



రుద్రూర్ జెడ్పీ హైస్కూల్ 1981-82 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

రుద్రూర్: మండల కేంద్రంలోని బాలుర జెడ్పీ హైస్కూల్‌లో 1981–82 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 43ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట కలిశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, రవికిరణ్, రాధారాణి, పూర్వ విద్యార్థులు నారాయణ, ప్రభాకర్, శ్రీనివాస్ బాబా, శానం శంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిలు, కిష్టయ్య, గణేష్ పాల్గొన్నారు.

సాలూరలో 17 ఏళ్లకు..

బోధన్: సాలూరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. 17ఏళ్ల తర్వాత ఆనాటి విద్యార్థులందరూ మళ్లీ కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి, సన్మానించారు.

చౌట్‌పల్లిలో 26ఏళ్లకు..

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నవ్వులు పూయించారు. గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి పాదాభివందనాలు చేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు.



సాలూర జెడ్పీహెచ్ఎస్ 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



చౌట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

నిరుపయోగంగా తోపుడు బండ్లు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కింద ప్రతి గ్రామానికి చెత్తను తొలగించే తోపుడు బండ్లను అందజేసింది. ఆ తోపుడు బండ్లను కొన్ని రోజులు మాత్రమే వాడుకొని వదిలేశారు. చాలా గ్రామాలలో ఆ తోపుడు బండ్ల ఆనవాలు లేకుండా పోయాయి. సంగోజివాడితో పాటు కొన్ని గ్రామాలలో వీటిని స్టోర్‌రూంలు, పల్లెప్రకృతివనాల్లో ఉంచారు. మరి కొన్ని గ్రామాలలో ఎండలకు ఎండి, వానలకు తడిసిపోయి పనికి రాకుండా పోయాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



రుద్రూర్: పోతంగల్ మండలంలోని కారేగాం శివారులో పునర్నిర్మించిన స్వయంభూ మహాదేవ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు వైభవంగా కొనసాగాయి. యాగశాల ప్రవేశం, మహా సుదర్శన హోమం, మహా చండీ హోమం, మహా కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. జగద్గురు భీమ శంకర లింగా శివాచార్య మహరాజ్, సద్గురు శివానంద్ శివాచార్య స్వామి, మల్లికార్జున శివాచార్య స్వామి, సిద్ధి లింగప్ప స్వామిప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా వేములవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడకు వెళ్లే బస్సులకు మహాలక్ష్మి స్కీం వర్తింస్తుందన్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాక్లూర్‌లో చికెన్ మేళా



మాక్లూర్: మండల కేంద్రంలో వెన్‌కాబ్, సనా చికెన్ సెంటర్ల ఆధ్వర్యంలో ఆదివారం చికెన్ అండ్ ఎగ్ మేళా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వైరస్ లేదని, ఒకవేళ ఉన్నా 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం వల్ల వైరస్ పూర్తిగా నాశనం అవుతుందని అన్నారు. అనంతరం ప్రజలకు చికెన్ ఫ్రై ముక్కలు, ఎగ్ స్నాక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశా రు. చికెన్ సెంటర్ యజమానులు పాల్గొన్నారు.



జంగంపల్లి గ్రామ పెద్ద చెరువులో మట్టి రాసుకొని సూర్యనమస్కారాలు చేస్తున్న యువకులు

'మట్టి స్నానం ఆరోగ్యానికి మంచిది'

భిక్కనూరు: మట్టి స్నానం ఆరోగ్యానికి మంచిదని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జంగంపల్లి గ్రామ పెద్ద చెరువులో మట్టి స్నానాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టమట్టి, ఆవు పేడ, ఆవు మూత్రం సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని శరీరానికి పట్టించి ఎండలో ఎండిన పిదప చెరువులో స్నానం చేయడం ద్వారా స్వేద రంధ్రాలు శుభ్రం అవుతాయన్నారు. దీంతో శరీరానికి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ కార్యదర్శి పి.అంజయ్య, ప్రతినిదులు సిద్ధగౌడ్, వెంకటేష్, ఈశ్వర్, పోచయ్య, లక్ష్మిపతి, యోగా గురువు అంతిరెడ్డిలు పాల్గొన్నారు.

విషమంగా చిన్నారి ఆరోగ్య పరిస్థితి

రామారెడ్డి: మండలంలోని స్కూల్ తండాకు చెందిన ఇద్దరు అక్కచెల్లెలు శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందును జ్యూస్‌గా భావించి తాగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో చిన్నారులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. అక్క గంగవత్ సంజన ఆరోగ్యం బాగానే ఉన్నా, చెల్లెలు బిందు పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తండావాసులు తెలిపారు.

తాండూర్ అటవీ ప్రాంతంలో మళ్లీ మంటలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ శివారులో గల అటవీ ప్రాంతంలో ఆదివారం మళ్లీ మంటలు చెలరేగాయి. గురువారం రాత్రి అదే ప్రాంతంలో మంటలు చెలరేగాయి. మళ్లీ రెండోసారి మంటలు చెలరేగడంతో అటవీశాఖ అధికారులు విషయం తెలుసుకొని ఫైరింజన్ సహాయంతో మంటలను ఆర్పించారు. కాగా గడిచిన వారం రోజుల్లోనే తాండూర్ శివారులోని అటవీప్రాంతంలో రెండుసార్లు మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీప్రాంతంలోకి వెళ్లే పశువుల కాపర్లు, మేకల, గొర్ల కాపరులు వెలిగించిన బీడీ, సిగరెట్ ముక్కలను ఆర్పకుండా పడేయడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయా?, లేక ఎవరైనా కావాలనే నిప్పు పెడుతున్నారా అనే విషయాన్ని అధికారులు గుర్తించాల్సి ఉంది.

క్రైం కార్నర్

మొరం ట్రాక్టర్ల పట్టివేత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. తిమ్మాపూర్ క్రాస్‌రోడ్ వద్ద ట్రాక్టర్‌లో మొరంను తరలిస్తుండగా, పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. బాధ్యుడైన బండారు ప్రభాకర్‌తో పాటు, ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



ఎడపల్లి(బోధన్): మండలంలోని బాపునగర్‌కు చెందిన కట్కూరు రాములు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. రాములు శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో రాములు భార్య నాగజ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాములు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కాఫీ కలర్ షర్ట్ ధరించాడన్నారు. ఎత్తు 5.6 అడుగులు ఉంటాడని, తెలుగు, హిందీ భాషలు మాట్లాడుతారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్సై విజయ్‌కొండ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కెనాల్‌లో పడి ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలోగల డి46 కెనాల్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి నీటిలో మునిగి మృతిచెందాడు. వివరాలు ఇలా.. మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌కు చెందిన వినోద్(30) ఏఆర్‌పీ క్యాంప్‌లోని ఇటుక బట్టీలో పనిచేయడానికి మూడు రోజుల క్రితం వచ్చాడు. ఈక్రమంలో ఆదివారం కాలకృత్యాల కోసం డి46 కెనాల్‌కు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. ఈమేరకు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ..

ఖలీల్‌వాడి: అర్సపల్లి, జాన్కంపేట్ రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ(50) రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. అర్సపల్లి రైల్వే గేటుకు 200 మీటర్ల దూరంలో ఒక గుర్తు తెలియని మహిళ రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు స్టేషన్ మేనేజర్ సీహెచ్ సాగర్ పోలీసులు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైతునగర్‌లో క్షుద్రపూజల కలకలం



ఇంటి ఎదుట వేసిన పసుపు బియ్యం

బాన్సువాడ: బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో శనివారం రాత్రి క్షుద్ర పూజల కలకలం రేగింది. ఇళ్ల ముందు పిండితో తయారు చేసిన బొమ్మ, నిమ్మకాయలు, పసుపు బియ్యం ఉండడంతో గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా.. రైతునగర్ గ్రామానికి చెందిన గూల పోచవ్వ అనే మహిళ పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. శనివారం రాత్రి ఇంట్లో నిద్రించగా అర్ధరాత్రి వేళ కుక్కల అరుపులతో మెలకువ వచ్చింది. దీంతో ఆమె బయటకి వచ్చి చూడగా ఇంటి ముందు పిండితో చేసిన బొమ్మ, నిమ్మకాయలు, పసుపు కలిపిన బియ్యం కనబడడంతో అరుపులు చేస్తూ చుట్టుపక్కల వారిని నిద్రలేపింది. అలాగే మరో మహిళ ఉప్పరి హన్మవ్వ ఇంటి ముందు కూడా నిమ్మకాయలు పడి ఉన్నాయి. సీసీ రోడ్డుపై అక్కడక్కడ రక్తం మరకలు కూడా ఉన్నాయి. దీంతో కాలనీవాసులందరూ రాత్రంతా భయంభయంతో గడిపారు. ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. నాలుగైదు రోజులుగా కాలనీలో ఒక్కొక్కరి ఇంటి ముందు ఇలా ఉంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఎవరో కాలనీ వాసులను భయపెట్టాలనే దురుద్దేశ్యంతో ఇలా చేశారా? లేక.. గుప్తనిధుల కోసం కాలనీని ఖాళీ చేయాలనే ఉద్దేశ్యంతో చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వెంటనే పోలీసులు స్పందించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.